# పట్టాలే కాదూ.. ఇండ్లు కట్టించే జిమ్మేదారి నాదే..

గరీబోళ్లకు సేవ చేయడమే నా లక్ష్యం



భావోద్వేగానికి గురైన మహిళ కన్నీళ్లు తుడుస్తున్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

- బీఆర్ఎస్ సర్కారుకు పేదల గోస తెలుసు
- తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్
- ఎంహెచ్‌నగర్‌లో పేదలకు ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీ
- ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన స్థానికులు
- భావోద్వేగానికి గురైన మహిళ కన్నీళ్లు తుడిచిన నన్నపునేని



పూలు చల్లుతూ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు ఘన స్వాగతం పలుకుతున్న గుడిసెవాసులు

పోచమ్మమైదాన్, అక్టోబర్ 8: స్థలాలకు పట్టాలు అందించడమే కాదూ.. అర్హులందరికీ ఇండ్లు కట్టించే జిమ్మేదారి తనదేనని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. 13వ డివిజన్ ఎంహెచ్‌నగర్‌లో రెండు దశాబ్దాల నుంచి పట్టాల కోసం ఎదురుచూస్తున్న గుడిసెవాసులకు ఆయన ఆదివారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువు నుంచి డప్పుచప్పుళ్లు, కోలాటాలు, బతుకమ్మలు, డీజేతో అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఆయనను గజమాలతో సత్కరించారు. 20 ఏళ్ల తర్వాత కల నెరవేరడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ నరేందర్‌నే ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని తెగేసి చెప్పారు. అనంతరం కార్పొరేటర్ సురేశ్‌కుమార్ జోషి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నరేందర్ మాట్లాడుతూ గరీబోళ్లకు సేవ చేయడమే తన లక్ష్యమన్నారు. ఇరవై ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నా గత పాలకులు పేదలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. నాడు పేదలు ఎంత గోస పడ్డారో, ఎంత కష్టపడ్డారో తనకు తెలుసునన్నారు. అందుకే సీఎం కేసీఆర్ సహకారంతో ఇరవై ఏళ్ల కలను సాకారం చేశానన్నారు. మాట తీసిపోకుండా ఇంటి నంబర్, కరెంటు, సకల వసతులు కల్పించి అండగా ఉన్నానని గుర్తుచేశారు. గతంలో పాలించిన నాయకులు మన గోసను ఏనాడు పట్టించుకోలేదని, కనీసం అవసరాలు కూడా తీర్చకుండా అన్యాయం చేశారని తెలిపారు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, డబుల్ బెడ్‌రూం, గృహలక్ష్మి.. ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. ఇప్పటికే ఉపాధి అవకాశాల కోసం వరంగల్ జిల్లాలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసుకున్నామని, రానున్న కాలంలో నియోజకవర్గంలో కంపెనీలను ఏర్పాటు చేసుకుని మన బిడ్డలకు ఉద్యోగాలు దొరికేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఎంహెచ్‌నగర్ చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద బండ్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### భావోద్వేగానికి గురైన మహిళ..

ఇళ్ల పట్టాల కోసం ఇన్నేండ్లు చెప్పులు అరిగెలా తిరిగి దెబ్బలు తిని, ధర్నాలు చేసి ఎంతో గోస పడ్డామని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకటి కాదు.. రెండు కాదూ.. ఇరవై ఏళ్ల నుంచి పడరాని కష్టాలు పడ్డాం.. పోలీసులతో దెబ్బలు తిన్నాం.. కేసులు భరించామంటూ వాపోయారు. ఈ సందర్భంగా ఓ మహిళ భావోద్వేగానికి గురై విలపిస్తుండగా ఎమ్మెల్యే నరేందర్ కన్నీళ్లు తుడిచి, నేనున్నానంటూ భరోసా కల్పించారు.

ఇకనుంచి మీకు చీకటి రోజులు రావని, అంతా తాను చూసుకుంటానంటూ ధైర్యం చెప్పారు. అనంతరం మహిళ మాట్లాడుతూ.. మేము పడ్డ కష్టాలకు దేవుడిలా నరేందరన్న వచ్చాడని, ఇక మాకు ఢోకా లేదన్నారు. అలాగే, మా మధ్య కార్పొరేటర్ సురేశ్ జోషన్న ఉంటూ అన్ని చూసుకుంటున్నాడని ఆనంద భాష్పాలు రాల్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్పొరేటర్ సురేష్ కుమార్ జోషితో కలిసి లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు, గృహలక్ష్మి ప్రొసీడింగ్స్, బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు.


## గిరిప్రసాద్‌నగర్‌లో సంబురాలు

ఖిలావరంగల్: వరంగల్ 37వ డివిజన్ గిరిప్రసాద్‌నగర్‌లో గుడిసెవాసులు సంబురాలు జరుపుకున్నారు. జీవో నంబర్ 58, 59 ద్వారా గుడిసె స్థలాలకు శనివారం ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పట్టాలు పంపిణీ చేశారు. దీంతో ఆదివారం కాలనీ వాసులు సంబురాలు నిర్వహించారు. పటాకులు కాల్చి డీజే సౌండ్‌కు స్టెప్పులు వేశారు. కాగా, ఎమ్మెల్యే నరేందర్ తన సొంత ఖర్చులతో గుడిసెవాసులకు మటన్‌తో భోజనం ఏర్పాటు చేసి, స్వయంగా వడ్డించారు. గిరిప్రసాద్‌నగర్ వాసులకు తమ ఇండ్ల స్థలాలకు హక్కుదారులు కావడంతో హర్షం వ్యక్తం చేశారు. తూర్పులో ఎమ్మెల్యే నరేందర్‌ను మళ్లీ భారీ మెజారిటీతో గెలిపించి గులాబీ జెండాను ఎగురవేస్తామని గిరిప్రసాద్‌నగర్ వాసులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, గిరిప్రసాద్‌నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఉల్ఫత్, బీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు బోగి సురేశ్ పాల్గొన్నారు.



గిరిప్రసాద్‌నగర్‌లో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నరేందర్

# బీఆర్ఎస్‌తోనే తండాల అభివృద్ధి



'గృహలక్ష్మి' లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

- గ్రామ పంచాయతీలుగా గుర్తించిన సీఎం కేసీఆర్
- గిరిజనుల రిజర్వేషన్‌ను పెంచిన సర్కారు
- అన్ని జీపీలకు వందశాతం పక్కా భవనాలకు నిధులు
- రాష్ట్ర ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలి
- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేటరూరల్, అక్టోబర్ 8: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే మారుమూల గ్రామాలు, తండాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని భోజ్యానాయక్‌తండాలో రూ. 20 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆదివారం పెద్ది ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత సర్పంచ్ భూక్యా లలితను సర్పంచ్ కుర్చీలో కూర్చోబెట్టి అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, ప్రత్యేక నిధులు కేటాయించి సొంత భవనాలు నిర్మిస్తున్నారని పెద్ది అన్నారు. ప్రత్యేక జీపీల ఏర్పాటుతో గిరిజనుల కీర్తిప్రతిష్టలు పెరిగాయని, ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. నర్సంపేట నియోజకవర్గంలో వందశాతం జీపీలకు నిధులు కేటాయించి పక్కా భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రజలకు పాలనాపరంగా ఉన్న దూరాన్ని దగ్గర చేసేందుకు ప్రత్యేక జీపీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. మారుమూల తండాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, ప్రజలు మరోసారి తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. భోజ్యానాయక్‌తండాకు రింగురోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. అదనంగా 200 మీటర్ల సీసీరోడ్లు, జీపీకి ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అనంతరం అర్హులైన 11 లబ్ధిదారులకు ఎమ్మెల్యే పెద్ది చేతులమీదుగా గృహలక్ష్మి పథకంలో ప్రొసీడింగ్స్ పత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా లలిత, ఏఈ చందర్, క్లస్టర్ ఇన్‌చార్జిలు మోతె పద్మనాభరెడ్డి, భూక్యా వీరూనాయక్, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, కడారి కుమారస్వామి, కట్ల సుదర్శన్‌రెడ్డి, వార్డు సభ్యులు భూక్యా రాజునాయక్, నునావత్ మున్యా, అజ్మీరా సూరయ్య, భట్టు ప్రమీళ, రాజేశ్, భూక్యా జయమ్మ, భద్రు, తిరుమల రాజు, జ్యోతి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజునాయక్, కార్యదర్శి అనిల్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు చీరెలు అందజేస్తున్న కార్పొరేటర్ పోశాల పద్మ, అధికారులు

# ఊరూరా బతుకమ్మ చీరెల పంపిణీ

కరీమాబాద్/గిర్మాజీపేట/ఖానాపురం, అక్టోబర్ 8: బీఆర్ఎస్ సర్కారు అందజేసిన బతుకమ్మ చీరెలను ఆదివారం ఊరూరా మహిళలకు పంపిణీ చేశారు. వరంగల్ 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ డివిజన్ పరిధిలోని మహిళలకు అందజేశారు. అలాగే, 42వ డివిజన్‌లో కార్పొరేటర్ గుండు చందన చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆడబిడ్డలకు చీరెలు అందిస్తున్నదన్నారు. 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన పిన్నవారివీధిలోని తన కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. అలాగే, బీసీ బంధు, కల్యాణలక్ష్మి చెక్కులను బీఆర్ఎస్ నేత గందె నవీన్ అందజేశారు. నాయకులు మంద నర్సింహారెడ్డి, శ్రీపతి శ్రీహరిగౌడ్ పాల్గొన్నారు. కాశీబుగ్గ 19వ డివిజన్‌లోని స్వశక్తి భవన్‌లో కార్పొరేటర్ ఓని స్వర్ణలతా భాస్కర్ ఆధ్వర్యంలో చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొట్ల సదానందం, ఆర్టీఏ సభ్యుడు గోరంటల మనోహర్, డివిజన్ అధ్యక్షుడు ఈటెల ఉమామహేందర్, నాయకులు వేముల నాగరాజు, గణిపాక సుధాకర్, సిలువేరు రాజు, కలివేలు రాజు, మామిడి ముత్తయ్య, రేపూడి కిరణ్, జంగం మల్లేశం, దేవరకొండ చంద్రమౌళి, నూ కల రాణి పాల్గొన్నారు.

### అన్ని పండుగలకూ ప్రాధాన్యం

ఖానాపురం: బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని పండుగలకూ సమప్రాధాన్యం ఇస్తున్నదని జడ్పీటీసీ బత్తిని స్వప్న శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ధర్మారావుపేటలో జడ్పీటీసీ బత్తిని స్వప్న, కొత్తూరులో సర్పంచ్ రమ మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం పండుగలను పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత సీఎం కేసీఆర్ మన సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెన్ను శ్రుతి, పూర్ణచందర్, అశోక్, రాంబాబు, స్రవంతి పాల్గొన్నారు.



బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఓని స్వర్ణలత

## ఆలిండియా సర్జన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ మోహన్‌దాస్

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 8: ఆలిండియా సర్జన్స్ తెలంగాణ చాప్టర్(విభాగం) అధ్యక్షుడిగా కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సుదీర్ఘకాలంగా వైద్య రంగంలో సేవలు అందిస్తున్న డాక్టర్ మోహన్‌దాస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు కాకతీయ మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పలువురు విభాగాధిపతులు, ఎంజీఎం వైద్యాధికారులు, వైద్యులు, నగర ప్రముఖులు అభినందనలు తెలిపారు.



మోహన్‌దాస్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ వైద్యులు